
ఆంధ్రజ్యోతి
***
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.35 | సహర్: 4.51 (శుక్రవారం)



ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 28 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	206	234
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 , కనిష్ఠం 24.0

కరువు సాయమివ్వండి!


- జిల్లాలో ఎండిన పంటలతో నష్టపోయిన రైతాంగం
- నీటికోసం బత్తాయి రైతుల ఆగచాట్లు
- కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలి: బీఆర్ఎస్, సీపీఎం



నల్లగొండ మండలం దోనకల్‌లో పంట ఎండి పోవడంతో దిగాలుగా కూర్చున్న రైతు

నల్లగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :దశాబ్ద కాలం తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కరువు తాండవి స్తోంది. నాగార్జునసాగర్ మొదలుకొని ఇతర రిజర్వాయర్లలో నీళ్లు లేకపోవడం, భూగర్భజలాలు గణనీయంగా పడిపోవడంతో యాసంగి సీజన్‌లో సాగు చేస్తున్న రైతులను ఇక్కట్ల పాలు చేసింది. వరి, వేరుశనగతో పాటు ఇతర పంటల సాగుతో తీవ్రంగా నష్టపోయారు. బత్తాయి, నిమ్మ పండ్ల తోటల రైతులు వ్యయప్రయాసలతో ప్రతికూల పరిస్థితులను ఎదురీదుతు న్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులకు, పండ్లతోటల రైతులకు ప్రభుత్వం కరువు ప్రాతిపదికగా సహాయం ప్రకటించాలని ప్రతిపక్ష, రైతుసంఘాల నాయకులు, రైతాంగం డిమాండ్ చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో ప్రభుత్వం నుంచి కరువు సాయంపై ఎలాంటి కార్యాచరణకు ఆస్కారం లేకుండాపోయింది. వ్యవసాయ, ప్రణాళికశాఖల అధికారులు సాధారణ రీతిలోనే పంటల దిగుబడుల వివరాలు నమోదు చేస్తున్నారు. కరువుపీడిత ప్రాంతాలను సందర్శించే నిమిత్తం ప్రధాన ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్ ఏప్రిల్‌లో జిల్లాలో పర్యటించేందుకు సిద్ధమవడంతో రాజకీయంగానూ కరువు ప్రధానాంశంగా మారింది.

జిల్లాలో పంటలు ఎండిపోవడం, చెరువుల్లో నీటితో పాటు భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. గతేడాదితో పోలిస్తే మూడు మీటర్ల లోతుల్లోకి భూగర్భ జలాలు వెళ్లాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. రూ.వేలు ఖర్చు చేసి బోర్లు వేయిస్తున్నారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటితో నాలుగు ఎకరాలు సాగు చేసిన రైతులు రెండు ఎకరాలకు నీరందిస్తూ పంటను కాపాడుకుంటున్నారు. పండ్ల తోటల రైతుల పరిస్థితి మరింత దారుణం. అప్పులు చేసి రూ.లక్షలు ఖర్చు చేసి బోర్ల మీద బోర్లు వేస్తున్నారు. అదేవిధంగా కొంతమంది ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పొలాలు పారిస్తున్నారు.





ఎదురీదుతోన్న పండ్ల తోటల రైతులు

జిల్లాలో గతేడాదితో పోల్చుకుంటే ఈ సీజన్‌లో ఇప్పటికే సుమారు 5.50 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. గతేడాది ఇదే సీజన్‌లో 6.12 మీటర్ల లోతులో భూగర్భజలాలు లభ్యమైతే, ఈ ఏడాది 11.50 మీటర్ల లోతుకు పడిపోయాయి. నీటిమట్టాలు పడిపోవడంతో పండ్లతోటలను దక్కించుకునేందుకు తోటల రైతులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని నల్లగొండ, దేవరకొండ డివిజన్లలో అత్యధికంగా ఉన్న బత్తాయి తోటలతో పాటు నకిరేకల్ ప్రాంతంలో విస్తరించిన నిమ్మతోటల రైతులూ తోటలు బతికించుకోవడం కోసం విపరీతంగా బోరుబావులు తవ్విస్తున్నారు. జిల్లాలో దాదాపు 70వేల ఎకరాల్లో బత్తాయి, సుమారు 12వేల ఎకరాల్లో నిమ్మతోటలున్నాయి. తోటలున్న రైతులు నీటికోసం ఒక్కొక్కరు 10 నుంచి 15 వరకు కొత్త బోర్లు తవ్విస్తుంటే, 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు వేస్తే తప్ప నీరందడం లేదు. చందంపేట, నేరుడుగొమ్మతో పాటు గుర్రంపోడు, నల్లగొండ, తిప్పర్తి తదితర ప్రాంతాల్లో భూగర్భజలాలు గణనీయంగా పడిపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పిస్తున్న పరిస్థితి నెలకొంది.


పెట్టుబడికి సమానంగా పరిహారమివ్వాలి



జిల్లాలో ఈ సీజన్‌లో కరువు తీవ్రంగా ఉంది. 50 నుంచి 70 శాతం వరకు పొలాలు ఎండిపోయాయి. ఎకరాకు రూ.20వేల నుంచి రూ.30వేలవరకు పెట్టుబడి పెడితే, ఆదాయం లేకపోగా, పెట్టుబడి నష్టపోవాల్సి వచ్చింది. నష్టపోయిన పెట్టుబడికి సమానంగా నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలి. ప్రభుత్వం తక్షణం అన్ని గ్రామాల్లో పంటనష్టం వివరాలు సేకరించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

\- ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

తక్షణం కరువు సర్వే నిర్వహించి ఆదుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కరువుకు కారణం. కృష్ణా జలాల్లో వాటామేరక నీరు విడుదల చేయించలేకపోవడంతో పంటలకు నీరివ్వలేని దుస్థితి నెలకొంది. సాగర్ నుంచి వాటా మేరకు నీళ్లు వస్తే ఒకవైపు ఆయకట్టుకు నీరివ్వడంతో పాటు, మరోవైపు చెరువులను నింపడం ద్వారా మెట్టప్రాంతాల్లోనూ భూగర్భజలాలకు ఢోకా ఉండేది కాదు. ముందుచూపులేని ప్రభుత్వం వల్లే ఈ దుస్థితి తలెత్తింది. తక్షణం అన్ని గ్రామాల్లో పంటల సర్వే జరిపి నష్టపరిహారం ప్రకటించాలి.

\- చాడ కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి

మంగళంపల్లిని పరిశీలిస్తే...

జిల్లాలో కరువు పరిస్థితిని అంచనావేసేందుకు సీపీఎం ఆధ్వర్యంలో కట్టంగూరు మండలం మంగళంపల్లిలో సర్వే నిర్వహించారు. దీని ప్రకారం గ్రామంలో భూగర్భజలాలు తగ్గిన నేపథ్యంలో రైతులే స్వచ్ఛందంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే సగం విస్తీర్ణంలోనే వరిసాగు చేశారు. 1,010 ఎకరాల్లో వరి సాగు చేస్తే అందులో 758ఎకరాల్లో పంట ఎండిపోయిందని తేలింది. రైతులు ఈ యాసంగి సీజన్‌లోనే గ్రామంలో 497బోరుబావులు వేయించారు. దీంతో ఒకవైపు పంటలు ఎండి, మరోవైపు బోరుబావులు తవ్వడంతో తీవ్రంగా నష్టపోయారు. వరి సాగు చేసిన రైతులు ఎకరాకు కనీసం రూ.20వేల నుంచి రూ.25వేలవరకు పెట్టుబడి పెడితే, కౌలు సాగు చేసిన రైతులకు ఈ వ్యయం మరింత పెరిగింది.

అడుగంటిన భూగర్భజలాలతో ఎండుతున్న పంటలు

జిల్లాలో ఓ వైపు సాగర్, ఏఎమ్మార్పీల కింద క్రాప్‌హాలిడే ప్రకటించడంతో ఆయకట్టుతో పాటు ఇతర మెట్టప్రాంతాల్లోనూ ఈ యాసంగిలో బోరుబావుల ద్వారానే పంటలు సాగువేశారు. సుమారు 4.19లక్షల ఎకరాల్లో వరి, 18,287 ఎకరాల్లో వేరుశనగ, రెండు వేల ఎకరాల్లో పెసర పంటలు సాగయ్యాయి. వరి పైర్లకు పొట్టదశ, గింజకట్టే దశల్లో నీరందక 40 శాతం నుంచి 50శాతం వరకు పైర్లు ఎండిపోయాయి. నాలుగు ఎకరాలు సాగుచేసిన రైతులు ఎకరం నుంచి రెండు ఎకరాల వరకు వదిలేసి మిగిలిన పైరుకే నీళ్లు పెడుతూ దక్కించుకుంటున్న పరిస్థితి కొనసాగింది. వరి దిగుబడులు సైతం అదేస్థాయిలో తగ్గిపోవడం, మరోవైపు విక్రయాల్లోనూ ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్న పరిస్థితి నెలకొంది.

కాంగ్రెస్‌లోకి పిల్లి రామరాజుయాదవ్?

- నేడు కార్యకర్తలతో సమావేశం
- ప్రాధాన్యం కల్పిస్తామనే కీలకనేత హామీతో హస్తంవైపు చూపు



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన పిల్లి రామరాజు యాదవ్(ఫైల్)

నల్లగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌నేత పిల్లి రామరాజుయాదవ్ కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. గురువారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని అక్కలాయిగూడెంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో జరిగే సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంటారని ఆయన అనుచరవర్గం చెబుతోంది. ఈకీలక సమావేశానికి నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని తన అనుచరులు, కార్యకర్తలు అభిమానులు రావాల్సిందిగా రామరాజు ఆహ్వానాలు పంపడంతో ఆయన పార్టీ మారేఅంశం తెరమీదకు వచ్చింది.టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన రామరాజుయాదవ్ తెలంగాణ ఏర్పాటుఅనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఎమ్మెల్యేగా పోటీచేయాలనే సంకల్పంతో బీఆర్ఎస్‌ని వీడి ఆల్‌ఇండియాఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా పోటీచేశారు.ఈఎన్నికల్లో ఆయనకు 27వేల పైచిలుకు ఓట్లు రావడంతో ప్రాధాన్యం పెరిగింది. ఈ నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ వైపు అడుగులేస్తున్నారనే చర్చ జోరందుకుంది.

కాంగ్రెస్ ముఖ్యనేతల ఆహ్వానంతో...

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఎఫ్‌బీ నుంచి బరిలో నిలిచిన రామరాజుయాదవ్‌కు 27వేల పైచిలుకు ఓట్లు రావడంతో ఆయన కీలకనేతగా మారారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి ముఖ్యనేతలు రామరాజుని తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. కాంగ్రెస్ నుంచి సైతం ముఖ్యనేతలు రామరాజు కాంగ్రెస్‌లో చేరితే ఆయనకు ప్రాధాన్యం కల్పిస్తామనే హామీ కూడా ఇవ్వడంతో ఆయన ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసినట్లు ప్రచారం సాగింది.

ఈ నేపథ్యంలో తాజాగా గురువారం రామరాజుయాదవ్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తుండడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్‌లో చేరేందుకు కార్యకర్తల నుంచి మద్దతు కోరేందుకే ఈ సమావేశం నిర్వహిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టీడీపీలో కీలకనేతగా ఎదిగిన రామరాజు టీడీపీలో, బీఆర్ఎస్‌లో పట్టణాధ్యక్షుడిగా పనిచేశారు. ఒక పర్యాయం ఎంపీటీసీ సభ్యుడిగా, రెండు పర్యాయాలు మునిసిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. కొన్నాళ్లుగా ఆర్‌కేఎస్ ఫౌండేషన్ పేరుతో సామాజికసేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఆలయాలకు నిధులు, చనిపోయినవారికి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు మెటీరియల్, క్రీడాకారులకు స్పోర్ట్స్ మెటీరియల్ తదితర సేవా కార్యక్రమాలతో నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు సాధించుకోవడంతో రామరాజుని కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని ఆ పార్టీ ముఖ్యనేతలు నిర్ణయించినట్లు తెలిసింది.

లైసెన్స్‌డ్ ఆయుధాలు వెంటనే డిపాజిట్ చేయాలి



ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ టౌన్, మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో లైసెన్స్ కలిగిన ఆయుధాలను వెంటనే డిపాజిట్ చేయాలని ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 136 మంది లైసెన్స్ ఆయుధాలను కలిగి ఉన్నారని, వాటిని వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో గాని జిల్లా పోలీస్ కార్యాలయంలో గాని డిపాజిట్ చేయాలని ఆదేశాలు జారీచేశారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రజలు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు, శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా, ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయుధాలను డిపాజిట్ చేయని వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డిపాజిట్ చేసిన ఆయుధాలను ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తీసుకోవచ్చని సూచించారు. ఈ విషయంలో జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్నవారికి మినహాయింపు ఉందన్నారు.

నేటి నుంచి అందుబాటులోకి కొనుగోలు కేంద్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నల్లగొండ టౌన్, మార్చి 27 : యాసంగి ధాన్యం కొనుగోళ్ల కోసం ఈ నెల 28వ తేదీ నుంచి కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్ అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. 2023-24 యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో గతంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా పకడ్బందీగా కొనుగోలు చేయాలని కేంద్రాల ఇన్‌చార్జిలకు సూచించారు. వేసవి దృష్ట్యా ఎండలు ఎక్కువగా ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. సగటు నాణ్యతా ప్రమాణాల ప్రకారం ధాన్యంలో తేమ, తాలు శాతం సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ విషయంపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. రైతుల ద్వారానే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, మధ్య దళారుల ప్రమేయం ఉండరాదన్నారు. అంధ్రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి నిరంతరం తనిఖీలు చేస్తామన్నారు. నిర్వాహకులు ఒకవేళ బయటి రాష్ట్రం నుంచి వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు సందర్భంలో ఏవైనా సమస్యలు వస్తే స్థానిక తహసీల్దార్, ఆర్డీవోలు పరిష్కరించడానికి అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు ఎవరూ ప్రారంభించకూడదని అలాగే ప్రారంభంలో ప్రజాప్రతినిధులెవరు పాల్గొనకూడదని స్పష్టం చేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి రాజకీయపరమైన ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో పౌరసరఫరాలు, డీఆర్‌డీవో, వ్యవసాయ, జిల్లా కోఆపరేటివ్, మార్కెటింగ్, తూనికలు కొలతలు, ట్రాన్స్‌పోర్టు శాఖలు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, డీఆర్‌డీవో నాగిరెడ్డి, డీసీవో కరుణాకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, జిల్లా తూనికలు కొలతలు అధికారి రామకృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి పాల్గొన్నారు.

వైబ్రెంట్ తెలంగాణ అమలైతే..

- తెలంగాణ-2050 ప్రణాళికలో రూరల్ పరిధిలోకి నల్లగొండ జిల్లా
- ఎన్నికలు పూర్తయ్యాక పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళిక
- సమూల మార్పు దిశగా ఆలోచన
- మారనున్న ఉమ్మడి జిల్లా స్వరూపం



7

సమస్యల పరిష్కారానికి సత్వరమే స్పందించాలి



కొండమల్లేపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ

కొండమల్లేపల్లి, మార్చి 27 : విద్యుత్ వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఎస్ఈ చంద్రమోహన్ ఆదేశించారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించి, వేసవి దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కొండమల్లేపల్లిలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో ఎస్ఈ మాట్లాడారు. 10 మండలాల పరిధిలో గృహలక్ష్మి పథకం కింద 76,000 సర్వీసులు ఉండగా 40 వేలు మాత్రమే సబ్సిడీకి ఆమోదం పొందాయన్నారు. కొండమల్లేపల్లిలో విద్యుత్ సమస్య పరిష్కారానికి 100కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మరమ్మతుల కోసం ట్రాన్స్‌ఫార్మర్లను సొంత వాహనాల్లో తీసుకువస్తే వాటికి సంబంధించి ఖర్చులను విద్యుత్ శాఖ భరిస్తుందన్నారు. ఇందుకోసం రైతు తన ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ నెంబర్‌ను కార్యాలయంలో అందించాలన్నారు. వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహ, వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సమావేశంలో కొండమల్లేపల్లి డీఈ విద్యాసాగర్, దేవరకొండ, నాంపల్లి ఏడీలు సైదులు, సాగర్‌రెడ్డి, కొండమల్లేపల్లి, పీఏపల్లి, దేవరకొండ, చందంపేట, నేరెడుగొమ్ము ఏఈలు దేవోజీనాయక్, కావ్య, జమీరుద్దీన్, వినోద్, సాయిప్రకాశ్, మురళీ, లైన్‌మన్లు, జేఎల్ఎంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి



జిల్లా నూతన కమిటీతో రాష్ట్ర అధ్యక్షుడు మురహరి

నల్లగొండ టౌన్, మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురహరి బుద్దారం అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వివిధ జిల్లాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశం అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ బాధ్యులను సన్మానించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్ళి ఎండగట్టాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సి ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలంతా రానున్న ఎన్నికల్లో కష్టపడి పనిచేసి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎల్కచేను సాయిబాబా, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శరణ్యా రెడ్డి, ఉపాధ్యక్షుడు బోరింగ్ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన సైదులు, నర్మదా రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, ఎంగళి ప్రసాద్ మాధవరెడ్డి, బాలకృష్ణ, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

నాటక సాహిత్యంపై పరిశోధనలు పెరగాలి

సాహిత్య పరిశోధకులు సుంకిరెడ్డి నారాయణరెడ్డి



సాహిత్య సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి

నల్లగొండ కల్చరల్, మార్చి 27: నాటక సాహిత్యంపై పరిశోధనలు పెరగాలని సాహిత్య పరిశోధకులు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రెండు రోజుల తెలుగు నాటకం - సాహిత్య సమాలోచన అనే అంశంపై తొలిరోజు నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాటక సాహిత్యంపై పరిశోధనలు జరగడం లేదని, ఇలాంటి సదస్సులు నాటక సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించేలా ఉంటాయన్నారు. విద్యార్థులను పరిశోధకులుగా, సాహిత్య అభిమానులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయన్నారు. చాలామంది నాటక రచయితల రచనలు నేటి సాహిత్య లోకానికి అందడం లేదన్నారు. అలాంటివారి సాహిత్యాన్ని వెలికితీసి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ ఉత్తమ సినీ విమర్శక పురస్కార గ్రహీత డాక్టర్ ఎం.పురుషోత్తమచార్యులు మాట్లాడుతూ నాటక రచయితతో పాటు నటులు, నాటక ప్రయోక్తలందరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఆ నాటకం జనరంజకం అవుతుందన్నారు. రమ్యమైన దృశ్య కావ్యమని ఇలాంటి కావ్యాలు రాసిన రచయితలు తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని పొందారన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య సాగీ కమలాకర్‌శర్మ మాట్లాడుతూ నాటకరంగం మనోరంజకమైనదని నేడు సినిమాల ప్రభావంతో నాటకరంగ సంస్థలు కనుమరుగైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాటక సంస్థలను, నటులను ఆదరించాల్సిన అవసరం నేటి ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య కర్నిల్ల లావణ్య, తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ కౌండిన్య, ఎస్.లవేందర్‌రెడ్డి, వెల్దండి శ్రీధర్, గోవర్ధన గిరి, సైదులు, ప్రభాకర్, లింగస్వామి, రమ్య, అంజయ్య, దుర్గాప్రసాద్‌లతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మోత్కూరు, మార్చి 27: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో అధికారులు బుధవారం బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికకు వివాహం చేస్తున్నారని తెలుసుకున్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది కవిత, ఏఎస్ఐ వెంకన్న, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ దశరథ ఆ గ్రామానికి చేరుకుని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలిపి వేయించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, బాల్య వివాహ నిరోధక చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. బాలికను, ఆమె తల్లిదం డ్రులను జిల్లా బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరుపర్చారు. బాల్య వివాహాలు చేయిస్తున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

యాదగిరిగుట్ట ఆలయం అద్భుతం

● భారత నావికా దళాధిపతి అడ్మిరల్ హరికుమార్



హరికుమార్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈవో భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, మార్చి 27: యాదగిరిగుట్ట ఆలయం అత్యద్భుతంగా నిర్మితమైందని, తాను సందర్శించిన ఆలయాల్లో కెల్లా ఇక్కడి ఆలయం శిల్పకళా సౌందర్యంతో భక్తి భావం పెంపొందిస్తోందని భారత నావికా దళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ అభివర్ణించారు. బుధవారం యాదగిరిగుట్ట క్షేత్రాన్ని ఆయన కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం చేయగా, ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా అడ్మిరల్ హరికుమార్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణశైలిలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోందన్నారు. స్వామిని దర్శించుకున్న పవిత్ర అనుభూతి కలిగిందన్నారు. ఈవోను ప్రత్యేకంగా అభినందిస్తూ ఆలయ నిర్వహణ తీరును కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, అర్చకులు, వేద పండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

● యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో ఘటన



పంచాయతీ కార్యదర్శి కిరణ్

మోత్కూరు, మార్చి 27: ఇంటి పన్ను నిర్ధారిత ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు రూ.3వేలు లంచం తీసుకుంటూ ఓ పంచాయతీ కార్యదర్శి అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులకు చిక్కాడు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడులో ఈ సంఘటన జరిగిం ది. ఇందుకు సంబంధించిన వివరా లను ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్ తెలిపారు. మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన గొరిగె మహేష్ నూతనంగా నిర్మించుకున్న ఇంటికి పన్ను నిర్ధారిత ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకోసం కార్యదర్శి చిన్నం కిరణ్ లంచం ఇవ్వాలని డిమాండ్ చేయగా, మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచన మేరకు కార్యదర్శి కిరణ్‌కు రూ.3వేలు లంచం ఇస్తుండగా అదుపులోకి తీసుకు న్నట్లు డీఎస్పీ తెలిపారు. కిరణ్‌ను ఏసీబీ కోర్టులో ఫస్ట్‌క్లాస్ అదనపు స్పెషల్ జడ్జి ఎదుట హాజరు పర్చుతామన్నారు. బాధితుడు మహేష్ మాట్లాడుతూ పంచా యతీ కార్యదర్శి తనను రూ.8వేలు డిమాండ్ చేయగా, రూ.5వేలు పంచాయతీ కారోబార్ బంగారి ద్వారా పంపించానన్నారు. కిరణ్ తనను వదలకుండా మిగతా రూ.3వేలు ఇవ్వాలని పదే పదే అడుగుతుండటంతో ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

దేవరకొండ, మార్చి 27: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణం హనుమాన్ నగర్‌లోని ఓ ఇంట్లో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌నగర్‌లోని శ్రీనివాస్‌రావు అనే పెయింటింగ్ కాంట్రాక్టర్ ఇంట్లో కుటుంబ సభ్యులు ఇంట్లోలేని సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను పగలగొట్టి అందులో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు అపహరించారు. శ్రీనివాసరావు పెయింటింగ్ కాంట్రాక్టర్ కాగా పనిమీద బయటకు వెళ్లాడు. ఆయన భార్య కూడా కొండమల్లేపల్లికి వెళ్లింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు బాధితుడు శ్రీనివాసరావు తెలిపారు. గమనించిన ఇరుగు, పొరుగువారు శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.

ఎలక్ట్రికల్ షాప్‌లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన సామగ్రి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 27: యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఎలక్ట్రికల్ షాప్‌లోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సీత శేఖర్ మంగళవారం రాత్రి 9గంటలకు తన ఎలక్ట్రికల్ దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 10:30 గంటల సమయంలో దుకాణం పక్కనే ఉన్న చికెన్ షాప్ యజమాని ఫోన్ చేసి ఎలక్ట్రికల్ షాప్ నుంచి మంటలు వస్తున్నాయని శేఖర్‌కు సమాచారం ఇచ్చాడు. శేఖర్ వచ్చి చేసే సరికి దుకాణం పూర్తిగా కాలిపోయింది. స్థానికుల సాయంతో మంటలు ఆర్పారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు రూ.6లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు శేఖర్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

అర్వపల్లి: సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గోళ్ల మహేందర్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం దగ్ధమైంది. సూర్యాపేట నుంచి వచ్చిన ఫైరింజన్‌తో మంటలు ఆర్పారు. ఇంట్లో ఉన్న ఫ్యాన్లు, టీవీ, ఫ్రిజ్, బియ్యం బస్తాలు, ధాన్యం బస్తాలు, దుస్తులు, నగదు రూ.లక్ష పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.4లక్షల ఆస్తి నష్టం వాటిలినట్లు బాధితుడు తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

మిర్యాలగూడ అర్బన్, మార్చి 27: హైటెక్‌హంగుల తెరవెనుక గుట్టుగా సాగిపోతున్న వ్యబిచారంపై పోలీసులు దృష్టిసారించారు. ఏపీ రాష్ట్రసరిహద్దులో ఉన్న నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో కొందరు మహిళలు విటులను రప్పించి వలపు వల వేస్తున్నారు. విటులను ఆకర్షించేందుకు వాట్సాప్ ఇతర సోషల్‌మీడియా మార్గాల్లో స్మార్ట్‌గా వల వేస్తున్నారు. పట్టణ శివారు కాలనీలో విసిరేసినట్లుగా ఉండే భవాలను అద్దెకు తీసుకొని వ్యబిచారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. 20- 35 ఏళ్లలోపు యువతులతో వ్యబిచారం సాగిస్తున్నట్లుగా పోలీసులకు విశ్వసనీయంగా సమాచారం అందింది. దీంతో బుధవారం నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలలో వన్‌టౌన్ పోలీసులు ఆకస్మికంగా దాడిచేశారు. ఓ మూడు ఇండ్లలో ఉన్న 10మంది మహిళలతోపాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ వ్యవహారం ఎప్పటి నుంచి నడుస్తుంది..? దీనివెనుక ఉన్న సూత్ర, పాత్రదారులెవరు.. ఎక్కడెక్కడినుంచి విటులను రప్పిస్తున్నారు..? పట్టుబడ్డ యువతులు ఏ ప్రాంతానికి చెందినవారన్న దానిపై లోతైన విచారణ సాగిస్తున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. విచారణ పూర్తయిన అనంతరం వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

రూ.లక్ష నగదు స్వాధీనం



విచారణ నిర్వహిస్తున్న పోలీసులు

పెన్‌పహాడ్, మార్చి 27: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం పొట్లపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పెన్‌పహాడ్ ఎస్ రవీందర్ తన పోలీస్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. గరిడేపల్లి నుంచి మహబూబబాద్ జిల్లా మర్రిపేట వెళ్తున్న కారులో ఎలాంటి పత్రాలు లేకుండా లక్ష రూపాయలు తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్తే ఆ నగదు పట్టుబడితే సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్‌పహాడ్ పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

లైంగికదాడి ఘటనలో నిందితుడి రిమాండ్

చౌటుప్పల్ రూరల్, మార్చి 27: ఆడిస్తానంటూ తీసుకెళ్లి.. రెండేళ్ల బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చౌటుప్పల్ కోర్టులో హాజరుపెట్టిన అనంతరం మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని నల్లగొండ జైలుకు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 25 ఏళ్ల శివ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ అక్కడే ఓ గదిలో ఉంటున్నాడు. అక్కడే ఉంటున్న దంపతుల రెండేళ్ల బాలికను ఆడిస్తానంటూ సోమవారం సాయంత్రం తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. చిన్నారిని ఇంటి సమీపంలో వదిలివెళ్లటంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శివను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. చిన్నారి నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్సపొందుతోందని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

తిరుమలగిరి(సాగర్), మార్చి 27: నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని మండలంలోని అల్వాల గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. బాధిత రైతు రావులపాటి సైదులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సైదులు పాడి గేదెను పెంచుకుంటూ పాల ద్వారా తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే మేతకు వెళ్లిన గేదె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుష్ వైర్‌ను తాకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని సైదులు కోరాడు.

వైబ్రెంట్ తెలంగాణ అమలైతే..

» రూరల్ తెలంగాణ పరిధిలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు? » యాదాద్రి సగం జిల్లా హెచ్‌ఎండీఏ పరిధిలోకి » మిగితా సగం రూరల్‌గా



భువనగిరి టౌన్, మార్చి 27: దేశంలో 29వ రాష్ట్రంగా పదేళ్ల క్రితం ఏర్పడిన తెలంగాణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైబ్రెంట్ తెలంగాణ- 2050 ప్రణాళికలు రూపొందిస్తోం ది. తెలంగాణ రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. అలాగే ఇటీవల వరకు విస్తృతంగా ప్రచారం జరిగి న గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటుపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగురోడ్డు(ఓఆర్‌ఆర్) లోపలి వైపున్న ప్రాంతాలన్నింటినీ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోకి, ఓఆర్‌ఆర్ నుంచి రీజనల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) మధ్యలో ఉన్న ప్రాంతాలు హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ ఆథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోకి వెళ్లనున్నాయి. ఆర్‌ఆర్‌ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా రాష్ట్ర ప్రభుత్వం పరిగణించనుంది. దీంతో హైదరాబాద్ నగర పరిధిని విస్తృతం చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఎనిమిది మండలాలను లేదా మూడు మునిసిపాలిటీలను కలుపుతూ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు కానుందని ఇటీవలి వరకు విస్తృత ప్రచారం జరిగినా ఇప్పటికిప్పుడు ప్రభుత్వానికి అలాంటి ఆలోచన లేదని స్పష్టమవుతోంది.

ప్రభుత్వ ఆలోచన నిజమైతే..

వైబ్రెంట్ తెలంగాణ -2050 ప్రణాళిక నిజమైతే ఉమ్మడి జిల్లా సత్వర అభివృద్ధికి చెందుతుందని పలు రంగాల నిపుణులు అంటున్నారు. ఇప్పటి వరకు పలు కారణాలతో అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలన్నింటినీ అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రతిపాదిస్తున్న వైబ్రెంట్ తెలంగాణ-2050తో ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తారని, అందుకు అవసరమైన నిధుల కేటాయింపు, మంజూరు సులభతరం అవుతుందని అంటున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాను రూరల్ తెలంగాణ, హెచ్‌ఎండీఏ కేటగిరీలుగా పరిగణించనున్న నేపథ్యంలో పాలన పరమైన, రాజకీయ, భౌగోళిక, జిల్లాల ముఖ చిత్రాలు కూడా మారే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. జూన్ 6తో ముగిసే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అనంతరమే ప్రభుత్వ నూతన ప్రణాళికపై స్పష్టత రానుంది.

ఇటీవల సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు



ఔటర్ రింగురోడ్డు లోపలి వైపు ఉన్న సిటీ మొత్తాన్ని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోకి తీసుకొస్తామని, ఔటర్ నుంచి రీజనల్ రింగురోడ్డు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని హెచ్‌ఎండీఏ పరిధిలోకి తీసుకొస్తామని సీఎం ప్రకటించారు. రీజనల్ రింగు రోడ్డు నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా పరిగణించి అభివృద్ధి చేస్తామని వివరించారు. వైబ్రెంట్ తెలంగాణ-2050 సాధనే లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేస్తామని ప్రకటించారు.

మారనున్న ఉమ్మడి జిల్లా స్వరూపం...?

వైబ్రెంట్ తెలంగాణ-2050 సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికతో ఉమ్మడి జిల్లా సమగ్ర స్వరూపం మారనున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు కార్యరూపం వస్తే పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసే నాటికి రూపొందించనున్న ప్రణాళికలతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు రూరల్ తెలంగాణ పరిధిలోకి, యాదాద్రి భువనగిరి జిల్లాలోని 17 మండాలాల్లో 8 మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోని మిగతా 9 మండలాలు రూరల్ తెలంగాణలోకి వెళ్లనున్నాయి. కానీ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని ఏ ఒక్క ప్రాంతం కూడా విలీనం అయ్యే అవకాశాలు లేనట్లేనని ప్రచారం అవుతోంది. అలాగే జిల్లాల పునర్విభజన కూడా సక్రమంగా జరగలేదని నేటి ప్రభుత్వం ఇటీవల సీఎం పలుమార్లు పేర్కొన్న నేపథ్యంలో వైబ్రెంట్ తెలంగాణ-2050 ప్రణాళికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రణాళికలో భాగంగా మరోమారు జిల్లాల పునర్విభజనకు కూడా అవకాశాలు ఉంటాయనే చర్చ జరుగుతోంది.

చిత్తశుద్ధి ఉంటే లక్ష్యం సాధ్యమే



రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదిస్తున్న వైబ్రేంట్ తెలంగాణ -2050 ప్రణాళిక మంచిదే. కానీ పాలకులకు చిత్తశుద్ధి ఉంటేనే ప్రణాళిక అమలు సాధ్యం. ప్రణాళిక అమలుకు ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. కానీ పాలనకంటే రాజకీయమే ముఖ్యమని ఇటీవలి వరకు రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగిన విషయం విదితమే. తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆవే రాజకీయ బేధాభిప్రాయాలు కొనసాగితే మాత్రం నూతన ప్రణాళిక విఫల ప్రయోగంగా మిగులుతుంది.

- సింగనబోయిన సత్యనారాయణ, విశ్రాంత మునిసిపల్ కమిషనర్.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

కోదాడటౌన్, మోతె, పెద్దవూర, మఠంపల్లి, మార్చి 27: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. వరంగల్ జిల్లా హసన్‌పర్తిలో జరిగిన మరో ప్రమాదంలో సూర్యాపేట జిల్లా మఠంపల్లి వాసి మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం సమీపంలోని ఎస్ఆర్ఎం పాఠశాల వద్ద మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. అర్ధరాత్రి కావడంతో మృతదేహాన్ని గుర్తించకుండా వాహనాలు వెళ్లడంతో శరీరం నుజ్జు నుజ్జయింది. బుధవారం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ రాము తెలిపారు. షార్ట్ మినహా, శరీరంపై చొక్కా ఆనవాలు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని ఉంచినట్లు తెలిపారు. గుర్తుతెలియని మృతదేహం కింద కేసు నమోదు చేస్తు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని..

సూర్యాపేట జిల్లా మోతె మండలకేంద్రంలో బుధవారం తెల్లవారుజామున రోడ్డు వెంట ఆగిఉన్న వాహనాన్ని వెనకాల నుంచి బైక్ ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఏపీ రాష్ట్రం కృష్ణాజిల్లా నందివాడ గ్రామానికి చెందిన ఉండవల్లి నవీన్‌కుమార్(25) చౌటుప్పల్ పరిధిలోని దివీస్ లాబోరేటరి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన కంపెనీ సమీపంలోనే ఖమ్మం జిల్లాకేంద్రానికి చెందిన తన స్నేహితుడు కె. శివ వంశీరబ్బర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శివను ఖమ్మంలో బైక్‌పై వదిలివెళ్లడానికి ఇద్దరు కలిసి మంగళవారం బయలుదేరారు. బుధవారం తనకు డ్యూటీ ఉండడంతో ఖమ్మంలో శివను వదిలి తెల్లవారుజామున ఖమ్మం నుంచి అదే బైక్‌పై వస్తుండగా మోతె గ్రామ శివారులో ఉన్న ఫ్లైఓవర్ వద్ద రోడ్డు వెంట ఆగి ఉన్న లారీని వెనకాల ఢీకొట్టింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో గాయాలైన నవీన్‌ను సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు బుధవారం సాయంత్రం మృతిచెందాడు నవీన్ సోదరుడు ఉండవల్లి వెంకటనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని యువకుడు..



పోలెపల్లి గోపి(ఫైల్)

నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం బోయగూడెం గ్రామానికి చెందిన పోలెపల్లి గోపి(27), కటికల మధు టీఎస్ 05ఎఫ్‌హెచ్9326 నెంబర్‌గల బైక్‌పై బోయగూడెం నుంచి మల్లేపల్లి వైపు వెళ్తున్నారు. పెద్దవూర మండల కేంద్రంలోని కాటన్‌మిల్లు వద్ద జాతీయ రహదారి-167 సమీపంలోకి రాగానే హైదరాబాద్‌కు చెందిన అవుతు కోటిరెడ్డి హైదరాబాద్ నుంచి అజాగ్రత్తగా అతి వేగంగా కారును నడుపుతూ బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో గోపి, మధు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పోలేపల్లి గోపి(27) మృతిచెందాడు. గాయపడిన కటికల మధును మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. గోపికి భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోపి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దవూర ఎస్ఐ వీరబాబు తెలిపారు.

వరంగల్ జిల్లాలో రోడ్డు ప్రమాదం.. మఠంపల్లి వాసి మృతి



మోహన్ (ఫైల్)

వరంగల్ జిల్లా హసన్‌పర్తిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల వాసి మృతిచెందాడు. మఠంపల్లి మండలంలోని ఉమ్మడి భీల్యానాయక్‌తండా పరిధిలో గల బక్కులచ్చితండాకు చెందిన బానోతు మోహన్(35) వృత్తిరీత్యా లారీ డ్రైవర్ పని చేస్తుండేవాడు. స్థానిక సాగర్ సిమెంట్స్ నుంచి మంగళవారం లారీ లోడుతో బయలు దేరిన మోహన్ బుధవారం వరంగల్- కరీంనగర్ ప్రధాన రహదారిపై గేదెలను తప్పించబోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మోహన్ శరీర భాగం నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో భీల్యానాయక్‌తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మోహన్‌కు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మేకను కాపాడబోయి..



యువకుడు పడి మృతిచెందిన చేపల చెరువు



నవీన్(ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 27: మేకను కాపాడ బోయి చేపల చెరువులో పడి యవకుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మం డలంలోని మల్లాపురం గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రె నర్సింహులు, పారిజాత దంపతుల పెద్ద కుమారుడు నవీన్(27) తన వ్యవసాయ బావి సమీపంలో హైదరాబాద్‌కు చెందిన రఫీ అనే వ్యక్తికి చెందిన చేపల చెరువు ఉంది. తన మేక చెరువులోకి వెళ్లిందని దానిని తీసుకరావడానికి నవీన్ చెరువులోకి దిగాడు. చెరువు లోతుగా ఉండడంతో ఈతరాని చెరువులో మునిగి ఊపిరాడక అందులోనే మృతిచెందాడు. వ్యవసాయ బావివద్దనే ఉన్న తల్లిదండ్రులు గమనించి తమ కుమారుడు ఇప్పటి వరకు రాలేదని చెరువు వద్దకు వెళ్లి చూసేసరికి చెరువులో నుంచి మేక బయటకు వచ్చింది. నవీన్ చెరువులోనే పడిపోయాడని వారు కేకలు వేయడంతో అక్క డున్న వారు వచ్చి చెరువులో గాలించినా అతని జాడ దొరకలేదు. వెంటనే జేసీబీ ద్వారా చెరువుకట్టకు గండిపెట్టారు. దీంతో చెరువులోని నీరు బయటకు వెళ్లిపోవడం తో చెరువులో నవీన్ మృతదేహం లభించింది. మృతదే హాన్ని బయటకు తీసి దహనసంస్కారాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

విద్యుదాఘతంతో వృద్ధుడు మృతి

పాలకవీడు, మార్చి27: విద్యుదాఘతంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌పహాడ్ దర్గా గ్రామానికి చెందిన సాదినేని రోశయ్య(93) వృద్ధాప్యంతో మతిస్థిమితం సరిగాలేదు. అదే గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రోశయ్యకు ముగ్గురు కూతుళ్ల, కుమారుడు ఉన్నారు. రోశయ్య కుమారుడు సాదినేని జగ్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

పాలకవీడు, మార్చి27: వేర్వేరు కారణాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సిరాన్ భూయాన్(23) డీడీసీఎల్ ఏజెన్సీ ద్వారా సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని డెక్కన్ సిమెంట్ కర్మాగారంలో ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. సిరాన్ భూయాన్‌కు ఇటీవల పెళ్లి కుదిరింది. పెళ్లి ఇష్టం లేదని ఆదే ఏజెన్సీలో పనిచేసే సోదరుడు వరసయ్యే రాజ్‌దీప్‌కు, ఇతరులకు తరచూ చెప్తూ ఉండేవాడు. మంగళవారం సాయంత్రం కూడా అలాగే చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి రాకపోవడంతో బుధవారం ఉదయం సోదరుడు రాజ్‌దీప్, కొంత మంది కార్మికులతో కలిసి వెతకగా రావిపహాడ్ గ్రామ శివారులోని ఫారెస్ట్‌లో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు. సోదరుడు రాజ్‌దీప్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు హుజూరనగర్ ఏరియాసుపత్రికి తరళించినట్లు ఎస్ఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..

ఆత్మకూరు(ఎం): చేయడానికి సరైన పని దొరకడం లేదని జీవితం మీద విరక్తిచెంది పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పారుపల్లి గ్రామానికి చెందిన పట్టూరి శేఖర్ రెండో కుమారుడు పట్టూరి శివ(26) గత కొంత కాలంగా ఏపని చేయకుండా ఇంటివద్దనే ఉంటున్నాడు. శివ కొన్ని రోజులు మండల కేంద్రంలోని గ్రోమోరు కేంద్రంలో పనిచేశాడు. అక్కడ పని మానేసి ఖాళీగానే ఇంటివద్ద ఉంటున్నాడు. రోజు మాదిగానే మంగళవారం రాత్రి కూడా శివ ఇంటి దాబాపై పడుకున్నాడు. అప్పటికే పురుగుల మందు తెచ్చిపెట్టున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం తెల్లవారు జామున పురుగుల మందు తాగిన శివ తల్లికి తెలిపాడు. అప్పటికే అపస్మారక స్థితిలో పడిఉన్న శివను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. శివ తల్లి పట్టూరి కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎండీ. యాకూబ్‌ఖాన్ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో

చౌటుప్పల్ రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హనుమాన్‌నగర్ లో గల అద్దె గదిలో బుధవారం దివీస్ కంపనీ ఉద్యోగి కోరెపల్లి సంజయ్(25) అనారోగ్య సమస్యలతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటకు చెందిన సంజయ్ నాలుగు మాసాలుగా దివీస్ కంపనీ లో ఉద్యోగం చేస్తున్నాడని సీఐ తెలిపారు. సంజయ్ మృత దేహాన్ని పోస్టమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో పదో తరగతి విద్యార్థి మృతి



ఉమేష్(ఫైల్)

మోత్కూరు, మార్చి 27: తమ కుమారుడు పదో తరగతి పరీక్షలు ఉత్సాహంగా రాస్తున్నాడు.. పరీక్షలు ముగిస్తే సెలవులు, ఆ తర్వాత ఇంటర్‌లో చేర్పించాలన్న తల్లిదండ్రుల కలలపై పాము విషం చిమ్మింది. పాముకాటుతో విద్యార్థి బంగారు భవిష్యత్ కరిగిపోయి, తల్లిదండ్రుల కల చెదిరిపోయి పుట్టెడు శోకంలో మునిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ముక్కెర్ల కుమార్, మమత దంపతుల కుమారుడు ఉమేష్(16) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 18 నుంచి మోత్కూరులోని పరీక్ష కేంద్రానికి వెళ్లి వార్షిక పరీక్షలు రాస్తున్నాడు. ఇప్పటికే నాలుగు పరీక్షలు పూర్తయ్యాయి. మంగళవారం పరీక్ష రాసి వచ్చిన ఉమేష్ రాత్రి పొద్దుపోయే వరకూ గురువారం నాటి పరీక్షకోసం చదువుకున్నాడు. ఆ తర్వాత తల్లిదండ్రులు, తోబుట్టువుల పక్కన నేల మీద పడుకున్నాడు. రాత్రి నిద్రలో కట్ల పాము ఎప్పుడు కాటేసిందో ఎవరూ గమనించలేదు. అర్ధరాత్రి దాటాక ఉమేష్ లేచి కూర్చుని తల్లిదండ్రులను లేపి తనకు నలతగా ఉందని చెప్పాడు. ఇంతలో వాంతులు చేసుకున్నాడు. తనను ఏదో కరిచినట్టు అనిపించిందని చెప్పాడు. దీంతో వారు ఇంట్లో వెతకగా కట్ల పాము కనిపించింది. వెంటనే దాన్ని కొట్టి చంపారు. ఉమేష్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరో సారి వాంతి చేసుకుని మృతి చెందాడు. మమత, కుమార్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా ఉమేష్ పెద్దవాడు. ఈ సంఘటనతో దత్తప్పగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సహచర విద్యార్థులు బుధవారం సాయంత్రం నిర్వహించిన ఉమేష్ అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం తెలిపారు.

ఎక్కడ చూసినా కన్నీటి గోసే

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్లెదుటే ఎండుతుంటే అన్నదాతలు గోస పడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో కొన్ని గ్రామాల రైతులకు మూసి నీరే పంట పొలాలకు జీవనాధారం. మూసీకి ఆనుకొని ఉన్న మగ్దుంపల్లి వంటి గ్రామాలు అనావృష్టి వల్ల ఎడారిగా మారింది. ఎప్పుడూ గలగల పారే మూసీ ఈ వేసవిలో పంటలకు నీరందక ఎండిపోయాయి. పదుల సంఖ్యలో మోటార్లు పడావుగా మారాయి. చేసేదేమీ లేక రైతులు తమ మోటార్లను ఒక్కొక్కటిగా ఇళ్లకు తరలిస్తున్నారు. ఈ సారీ నీరందక పూర్తిగా పంట నష్టం వాటిల్లి జీవనోపాధి కోల్పోయామని, ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి



బీబీనగర్ మండలం మగ్దుంపల్లి గ్రామంలో మూసీనది ఎడారిగా మారడంతో నిరుపయోగంగా పంటపొలాల మోటార్లు, మోటర్ తీసుకెళ్తున్న రైతు



మగ్దుంపల్లి గ్రామంలో ఎండిన వరి పొలం



పోటీ పరీక్షలకు ఫీజులు మాఫీ చేయాలి

● బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండటౌన్, మార్చి 27: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం ఉద్యోగ పోటీ పరీక్షలకు ఫీజు లేకుండా అప్లికేషన్లు తీసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని పేర్కొన్నారు. సమావేశంలో బీ ఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు నోముల క్రాంతియాదవ్, రొమ్ముల నాగయ్య, నోముల శంకర్‌యాదవ్, సురేష్‌రెడ్డి, సుందర్, కిరణ్, వెంకన్న, లింగస్వామి, హరీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మీ సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, మార్చి 27: మీ సేవ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని అమ్మనబోలులో నూతనంగా మంజూరైన మీ సేవ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారులకు మీ సేవ కేంద్రం నిర్వాహకులు సత్వర సేవలందించి మన్ననలు పొందాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం మీ సేవ ద్వారా అందించే సేవలకు నిర్ణీత రుసుమునే వసూలు చేయాలని వినియోగదారులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో మీ సేవ నిర్వాహకులు అంతటి నాగరాజు, జహంగీర్, ఎంపీటీసీ కొంపెల్లి సైదులు, మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, నాయకులు కావటి యాదయ్య, పరశురామ్, మల్లేష్, రాజు, కుమార్, లక్ష్మయ్య, శివప్రసాద్, కాటమయ్య, స్వామి పాల్గొన్నారు.

మునుగోడు అభివృద్ధే లక్ష్యం : రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ, మార్చి 27: మునుగోడు నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 4వ తేదీన మండలంలోని అజలాపురం గ్రామంలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి బుగ్గ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ దేవాలయ కమిటీ చైర్మన్ ఏడుదొడ్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి శాలువా కప్పి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ దండేకర్ అంజయ్య, చైర్మన్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నర్సింగ్‌పురం నుంచి అజలాపురం వరకు అధ్వానంగా మారిన రోడ్డుకు నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని రోడ్లను మరమ్మతు చేయించేందుకు నిధులు మంజూరు చేసి బీటీ రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరామదాసు శ్రీనివాస్, ఎంపీటీసీ ఎన్నమనేని రవీందర్‌రావు, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, నాయకులు అజిత్‌రెడ్డి, దండు హనుమంత్, రవి, మల్లేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

టీఏ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నిక



వెంకటరమణ

నల్లగొండ, మార్చి 27: తెలంగాణ అగ్రికల్చర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ (టీఏఎంఎస్ఏ) ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా వి.వెంకటరమణ, సహా అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ, కార్యదర్శి టి.శ్రీనివాస్, కోశాధికారి డి.రాంమోహన్‌రాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, కార్యదర్శి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో బార్ ఎన్నికల కోలాహలం

● అధ్యక్ష పదవికి ముఖాముఖి ● సోషల్ మీడియానే ప్రచారాస్త్రం

మిర్యాలగూడ లీగల్, మార్చి 27: మిర్యాలగూడ పట్టణంలో గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయి. కోర్టుల్లో నిత్యం కేసులతో సతమతమయ్యే న్యాయవాదుల్లో వారం రోజులుగా ఎన్నికల కోలాహలం కనిపించింది. అధ్యక్ష పదవికి జి.రామకృష్ణారెడ్డి, ఎం.రాజేష్ పోటీపడుతుండగా, జనరల్ సెక్రటరీ పదవికి త్రిముఖ పోటీ నెలకొంది. సకినాల వేలాద్రి, ఎ.రాజ్‌కుమార్, మట్టపల్లి శ్రీధర్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ-2 పదవికి మోదాల మల్లేష్, సీహెచ్‌వీడీ.ప్రసాద్ పోటీపడుతున్నారు. మిగిలిన పదవులన్నీ కూడా ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు ఏచూరి శ్రీనివాస్, రెడ్డిపల్లి సైదులు తెలిపారు. అభ్యర్థులందరూ సోషల్ మీడియాను ప్రచారాస్త్రంగా ఎంచుకొని మెసేజ్‌లు, వాయిస్ మెసేజ్‌లతో అభ్యర్థులకు చేరవేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. కొంతమంది అభ్యర్థులు, ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తుండగా మరికొందరు సెల్‌ఫోన్ ద్వారా కాల్ చేసి మొదట మంచి చెడు మాట్లాడి తనకే ఓటు వేయాలని కోరుతున్నారు. సీనియర్ న్యాయవాదుల ఆఫీసులు ఎవరి వైపు మొగ్గుతారో వారికే విజయ అవకాశాలు మెండుగా ఉండటంతో అభ్యర్థులు సీనియర్లను ప్రసన్నం చేసుకొని ఓటు వేయాలని కోరినట్లు తెలిసింది. న్యాయవాదుల ప్రధాన సమస్య అయిన కోర్టుల నూతన భవన నిర్మాణాల స్థలం కోసం అధికారుల చుట్టూ తిరిగి అనుమతి మంజూరు చేయించగల సత్తా ఉన్న వారికే విజయ అవకాశాలు మెండుగా ఉన్నాయని కొంతమంది గుసగుసలాడుతున్నారు. తటస్థ ఓటర్లు కూడా ఎటువైపు మొగ్గుతారో ఇరువురు అభ్యర్థులకు అంతుచిక్కడం లేదు. ఏది ఏమైనా బార్ ఎన్నికలు ఓటర్లలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ రూరల్, మార్చి 27: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని ముల్కలకాల్వ గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయం ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని సూచించారు. స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● కోదండరామాలయంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ కులమతాలకతీతంగా భక్తిభావంతో మెలగాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదయ్యయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, మాజీసర్పంచ్ బోగబోయిన రాజు, నాయకులు హరిప్రసాద్, రవీంద్ర, హరిప్రసాద్, హన్ను, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తోపుచర్లలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు

మాడ్గులపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని తోపుచర్ల గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో బుధవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మంగా యాదయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

సమస్యాత్మకమైన

గ్రామాల గుర్తింపు

● ముందస్తుగా నేరస్థుల బైండోవర్

మర్రిగూడ, మార్చి 27: నాంపల్లి పోలీస్‌సర్కిల్ పరిధిలో సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించి ముందస్తుగా నేరస్థులను బైండోవర్ చేసినట్లు నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. మర్రిగూడ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శాంతిభద్రతల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాంపల్లి సర్కిల్ పరిధిలో మర్రిగూడ, చింతపల్లి, నాంపల్లి మండలాల్లో 16 సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించి 130 మందిని నేరస్థులుగా గుర్తించామని వారు తెలిపారు. మర్రిగూడ మండలంలో 4 సమస్యాత్మకమైన గ్రామాలు లెంకలపల్లి, ఖుదాభక్షపల్లి, శివన్నగూడ, మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో నాంపల్లి, పసునూరు, మల్లపురాజుపల్లి, పెద్దాపురం, ఎస్‌డబ్ల్యూ లింగోటం, నామానాయక్‌తండా, కేతేపల్లి గ్రామాలు, చింతపల్లి మండలంలో ఐదు గ్రామాలు చింతపల్లి, నసర్లపల్లి, మాల్, కుర్మేడ్, మల్లారెడ్డిగూడెంలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు పోలీస్‌శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు మే 13వ తేదీన జరగనున్న ఎన్నికలకు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా కాశీవిశ్వనాథేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

● గురజాలలో భక్తుల సందడి



ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

శాలిగౌరారం, మార్చి 27: శాలిగౌరారం మండలం గురజాల గ్రామంలో మూసీ నది ఒడ్డున 400 సంవత్సరాల పూర్వం వెలిసిన శ్రీ విశాలక్షి సమేత కాశీ విశ్వనాథేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఆలయంలో గణపతి, సుబ్రమణ్యం, వీరభద్ర చండీశ్వర్, నవగ్రహ, సర్ప(నాగదేవత) మూర్తులను వేదమంత్రాల మధ్య ప్రతిష్ఠించారు. విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేసిన అనంతరం మహాపూర్ణహుతి తదితర పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణానికి తలంబ్రాల బియ్యం తీసుకవచ్చి సమర్పించారు. చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పురోహితులు కొండవకంటి సుబ్రమణ్యశర్మ, మాజీ సర్పంచులు గుండా శ్రీనివాస్, మారం వేణుగోపాల్‌రెడ్డి, గూని మల్లయ్య, ఎంపీటీసీ నక్క శంకరమ్మ,మల్లేష్ దంపతులు, కోక యాదయ్య, ఆలయ కమిటీ సభ్యులు పొన్నబోయిన వెంకన్న, యల్మకంటి యాదయ్య, ఆలకుంట్ల కృష్ణ, పనికర కమలాకర్, ఆలకుంట్ల వెంకన్న, యల్మకంటి వీరయ్య, ముత్యాల వెంకన్న, అంతయ్య, శ్రీనివాస్, నాగరాజు, వెంకటాచారి, నర్సింహాచారి, యల్లయ్య దాతలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోషకాహార పక్షోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

నల్లగొండ టౌన్, మార్చి 27: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) నల్లగొండ డివిజనల్ కార్యాలయంలో ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన పోషకాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పక్షోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతకు సంస్థ సీనియర్ అధికారులు కేఎస్‌కే ప్రసాద్, రఘుపతి, బిల్లా శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి

నార్కట్‌పల్లి, మార్చి 27: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని కూరగాయల విక్రయ అంగడి స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను వెంటనే తొలగించాలని నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి (ఎన్‌పీఎస్) సభ్యులు డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు బుధవారం ఆ సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ నిర్లక్ష్యం వల్ల విలువైన అంగడి స్థలం అన్యాక్రాంతమై అక్రమ నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌పీఎస్ సభ్యులు మేడబోయిన శ్రీనివాస్, గూడూరు అంజిరెడ్డి, నోముల నాగరాజు, నడింపల్లి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆస్తి అయిన గ్రామ పంచాయతీ స్థలాన్ని ఇతరులు ఆక్రమించినా గ్రామపంచాయతీ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పట్టించుకోలేదు. అక్రమార్కుల చెరలో ఉన్న ఆ ఆస్తులను కాపాడాలని తాము పోరాటం చేస్తుంటే తమపై అక్రమ కేసులు నమోదు చేసి బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన మాంసం దుకాణాలను మూసివేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

మర్రిగూడ, మార్చి 27: బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎంపీ, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో నాయకులు పందుల రాములుగౌడ్, గ్యార గోపాల్, రాజుగౌడ్, యాదగిరి, గ్యార యాదగిరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

● సభలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

● ఆర్డీవో శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

మిర్యాలగూడ అర్బన్, మార్చి 27: పార్లమెంట్ సాధారణ ఎన్నికల కోడ్‌ను అన్ని రాజకీయ పార్టీలు ఖచ్చితంగా పాటించాలని ఆర్డీవో శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు నియోజకవర్గ పరిధిలో నార్కట్‌పల్లి - అద్దంకి ప్రధాన రహదారిపై శెట్టిపాలెం, దామరచర్ల, ఆలగడప వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనల మేరకు రాజకీయపక్షాలు నడుచుకోవాలని సూచించారు. ఫిర్యాదులు స్వీకరించేందుకు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రవర్తన, ఎన్నికల కోడ్ ఉల్లంఘన చర్యలపై 08689-295001కు ఫోన్‌చేసి ఫిర్యాదులు చేయవచ్చని ఆయన సూచించారు. అంతేకాకుండా సీ- విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎంసీసీ బృందాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాజకీయపక్షాలు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుకునేందుకు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి అనుమతి పొందాలని, సువిధ యాప్ ద్వారా వచ్చే దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌ను పారదర్శకంగా అమలుచేసేందుకు అన్ని తహసీల్దార్లు, ఇతర అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశానికి హాజరైన పలు రాజకీయ పార్టీల ముఖ్య నాయకులకు పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వివరాలను ఆర్డీవో వివరించారు.

పవర్‌లూం కార్మికుల కూలి పెంచాలి : సీఐటీయూ



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండరూరల్, మార్చి 27: పవర్‌లూం కార్మికుల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మనగర్‌లోని పవర్‌లూమ్ యజమానులకు బుధవారం చేనేత కార్మికులతో కలిసి కూలి పెంచాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పవర్‌లూమ్ కార్మికుల కూలీ పెంచాలని, పవర్‌లూమ్ కార్మికుల ఒప్పందం మార్చి 31తో ముగియనున్నదని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో యజమానులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా ప్రస్తుతం ఇస్తున్న కూలికి 40శాతం పెంచి, పని గంటలు ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే ఉండాలని సూచించారు. కార్మికులకు కావాల్సిన సౌకర్యాలు, అదే విధంగా పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు పెండెం రాములు, గంజి నాగరాజు, బుచ్చిరాములు, యోగానందం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

● నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవిగంగాధర్‌రావు

నల్లగొండ, మార్చి 27: వేసవికాలంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు అన్నారు. నకిరేకల్ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. భూగర్భజలాలు అడుగంటినందున నీటిఎద్దడి సమస్యలు వస్తున్నాయని, ఇప్పటి నుంచే ముందు జాగ్రత్తగా అధికారులు ఆయా గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే రైతుల బోరు బావుల నుంచినీటి సరఫరా చేయాలని సూచించారు. ప్రజలకు పైప్‌లైన్ల ద్వారా నీరు అందజేయాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యం ఎప్పటికప్పుడు ఐకేపీ సెంటర్ల ద్వారా ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో ఫర్వేజ్, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నేడు విద్యుత్‌కు అంతరాయం

హాలియా, మార్చి 27: మండల పరిధిలోని యాచారం సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు హాలియా విద్యుత్ ఏఈ బాలునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాచారం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ అన్నారం ఫీడర్ లైన్‌లో చెట్ల కొమ్మలను తొలగిస్తున్నట్లు తెలిపారు. దీంతో మండలంలోని అన్నారం, వెంకటాద్రిపాలెం, ముక్కమాల, కొసలమర్రి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. గృహ వాణిజ్య, పరిశ్రమలు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

మిర్యాలగూడ అర్బన్, మార్చి 27: సాగర్ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నందున ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని టూటౌన్ సీఐ నాగార్జున అన్నారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు విస్తరించి ఉన్న సాగర్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్యను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ట్రాఫిక్ ఎస్ఐ మోహన్‌బాబుకు వివరించారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా విస్తరించి ఉన్న తోపుడు బండ్ల వ్యాపారులు తమకు నిర్దేశించిన ప్రదేశం నుంచి వ్యాపార లావాదేవీలు కొనసాగించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

శాలిగౌరారం, మార్చి 27: శాలిగౌరారం మండలం బైరవుని బండ గ్రామానికి చెందిన ఈదులకంటి జానయ్య, పగడాల హరితలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఒక్కొక్కరికి మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గ్రామ తాజా మాజీ సర్పంచ్ దండ రేణుకఅశోక్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరిగే శంభయ్య, నాయకులు పడాల శంకరయ్య, లక్ష్మణాచారి, సైదులు, లతీఫ్ పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

మిర్యాలగూడ అర్బన్, మార్చి 27: పట్టణంలో సంచరించే యాచకులు, మానసిక వికలాంగులు, అనాథలకు హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి, ఫెయిత్ మినిస్టరీ నిర్వాహకులు బుధవారం అల్పాహారం పంపిణీ చేశారు. గుడ్‌ఫ్రైడే ఉపవాస దీక్షలో భాగంగా చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని వచ్చే మూడు నెలల పాటు నిర్విరామంగా కొనసాగిస్తామని ఫెయిత్ మినిస్టరీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు హన్యానాయక్ తెలిపారు.

'బీజేపీ సిద్ధాంతాలపై మాట్లాడే నైతిక అర్హత లేదు'

నల్లగొండ, మార్చి 27: బీజేపీ రాష్ట్ర నాయకుడు గుండెగోని మైసయ్యకు నివాళులర్పించలేని నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి బీజేపీ సిద్ధాంతాల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పాలకూరి రవి అన్నారు. మైసయ్య బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాబట్టే వర్ధంతి కార్యక్రమానికి హాజరుకాలేదని ఆయన విమర్శించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

త్రిపురారం, మార్చి 27: మండలంలోని అప్పలమ్మగూడెం, రూప్లాతండా, రాగడపలో ఉన్న పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ ప్రమీల పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఆమె వెంట ఆర్ఐ సైదులు, ఎస్ఐ వీరశేఖర్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మైసయ్య చేసిన సేవలు మరువలేనివి



మైసయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ, మార్చి 27: బీజేపీ రాష్ట్ర నాయకుడు గుండెగోని మైసయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మైసయ్య వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ప్రకాశంబజార్‌లో గల మైసయ్య విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామాల్లో పర్యటిస్తున్న క్రమంలో మావోయిస్టుల చేతిలో బలైయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మైసయ్యను బాబాయ్ అని ఆప్యాయతగా పిలుచుకునే వారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, రాష్ట్ర నాయకులు గుండెగోని భరత్, శ్రీను, నాగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గార్లపాటి జితేందర్‌కుమార్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, నూకల వెంకటనారాయణరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర నాయకులు చింతా ముత్యాలరావు, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, పోతేపాక సాంబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చేనమోని రాములు, జిల్లా కోశాధికారి పకీరు మోహన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ, నాగరాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.